సాక్షి సిద్దిపేట

శనివారం । 22 । జూన్ । 2024



యోగాసనంలో గరిమా అగర్వాల్



సిద్దిపేటలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, ప్రజలు



సిద్దిపేటలో యోగా చేస్తున్న యువతి

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హైదరాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ ఉచిత కోచింగ్ తీసుకునేందుకు గాను అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సరోజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు జూలై 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయం (08457–224941, 99666–73095)లో సంప్రదించాలన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి

సిద్దిపేట సీపీ అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ సూచించారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో రిసెప్షన్, వర్టికల్ సిబ్బందికి శుక్రవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పోలీసు స్టేషన్‌లో రిసెప్షన్, వర్టికల్ సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని గౌరవించాలని చెప్పారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి, చట్టపరంగా తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. రిసెప్షనిస్టు ప్రతి దరఖాస్తుపై తప్పనిసరిగా పిటిషన్ మేనేజ్‌మెంట్‌లో జనరేట్ చేసిన రశీదు ఇవ్వాలని సూచించారు. వేరే పరిధిలో నేరం జరిగినట్లు దరఖాస్తు వచ్చినా ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే దరఖాస్తు తీసుకుని రసీదు ఇవ్వాలన్నారు.

రెండు ప్రాజెక్టులు ఎంపిక



కీర్తన



బాలాజీ చారి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇన్‌స్పైర్ మానక్ జాతీయ స్థాయికి జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాఘవాపూర్‌కు చెందిన మారోజు బాలాజీ చారి, సిద్దిపేట పట్టణంలోని విద్యావర్ధిని పాఠశాలకు చెందిన విద్యార్థి నర్మెట కీర్తనలు తయారు చేసిన ప్రాజెక్టులు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్‌లను ఈ సందర్భంగా అభినందించారు.

25న జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక

రాయపోలు(దుబ్బాక): జిల్లా స్థాయి క్రీడాకారులను ఈ నెల 25న ఎంపిక చేయనున్నట్లు రాయపోలు ఎంఈఓ నర్సమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది సంవత్సరాల్లోపు వయసున్న బాల, బాలికలు రాయపోలులో నిర్వహించే క్రీడాపోటీలకు హాజరుకావాలని కోరారు. బోనఫైడ్, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. ప్రతిభ కనబర్చిన వారికి జిల్లాస్థాయిలో క్రీడా పోటీలు ఉంటాయన్నారు. మూడంచెల క్రీడా పోటీలలో ప్రతిభ కనబర్చిన వారికి హకీంపేటలోని క్రీడాపాఠశాలలో ప్రవేశం లభిస్తుందని వివరించారు.

నేడు జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

సిద్దిపేటజోన్: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈనెల 22, 24 తేదీల్లో నిర్వహిస్తున్నామని సీఈఓ రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 22న వ్యవసాయ, విద్య, వైద్యం, 24న సాంఘిక, శిశు సంక్షేమ, ఆర్థిక శాఖల తీరుతెన్నులపై సమీక్ష ఉంటుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అధ్యక్షతన ఈ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

ధరణి దరఖాస్తులు పరిష్కరించండి

సంగారెడ్డి టౌన్ : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో వాస్తవ నివేదికలు సేకరించి కలెక్టరేట్‌కు పంపించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీఓలు తహసీల్దార్లు పాల్గొన్నారు.

యోగానందం

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆరోగ్యంగా ఉంటేనే అన్ని సాధించగల్గుతామని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మలు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సిద్దిపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఆయుష్ విభాగం, భారతీయ స్వాభిమాన్ ట్రస్ట్, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రపంచానికి యోగాను అందించిన దేశం భారతదేశమన్నారు. దీంతో శారీరక, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయన్నారు. యోగా ఎక్కడ ఉంటుందో అక్కడ సర్వతో వికాసం ఉంటుందన్నారు. విద్యలో ఒక భాగం చేయాలన్నారు. విద్యార్థులతో పరీక్షల గురించి, మార్కుల గురించి మాట్లాడడం కాకుండా ఆరోగ్యం గురించి కూడా మాట్లాడాలని సూచించారు. తొలుత తెలంగాణ రాష్ట్ర యోగా అధ్యయన పరిషత్ సభ్యులు, తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, యోగా శిక్షకులు తోట సతీశ్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. మహిళలు, విద్యార్థులు ప్రదర్శించిన యోగా విన్యాసాలు ఆకర్షించాయి.




ఆసనాలు వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



హుస్నాబాద్‌లో..

కోతలే.. అధికం



జిల్లాలో సాధారణ ప్రసవాలు తగ్గుతున్నాయి. సిజేరియన్లు అత్యధికంగా చేస్తుండటంతో చిన్న వయసులోనే వివాహితలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. గతంలో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి నియంత్రణ చర్యలు చేపట్టింది. ఆశావర్కర్లు, ఎంపీహెచ్ఏ(ఎఫ్) వారి ద్వారా గర్భిణులకు వ్యాయామం నేర్పించేవారు. దీంతో సాధారణ ప్రసవాలు పెరిగి.. సిజేరియన్లు తగ్గుముఖం పట్టాయి. కానీ కొన్ని నెలలుగా పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ప్రైవేట్ ఆస్పత్రులపై సైతం పర్యవేక్షణ కొరవడింది. – సాక్షి, సిద్దిపేట

సాధారణ ప్రసవాలపై అలసత్వం

- దృష్టి సారించని వైద్యారోగ్యశాఖ
- ప్రైవేట్ ఆస్పత్రులపై కొరవడిన పర్యవేక్షణ

జిల్లాల్లో సిజేరియన్లు పెరిగిపోతున్నాయి. 2022లో 17,123 డెలివరీలు కాగా ప్రభుత్వ ఆస్పత్రిలో నార్మల్ 4,571, సిజేరియన్లు 5,945, ప్రైవేట్ ఆస్పత్రిలో నార్మల్ డెలివరీలు 676, సిజేరియన్లు 5,931 అయ్యాయి. 2023లో 16,005 డెలివరీలు కాగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నార్మల్ 5,045, సిజేరియన్ 6,043, ప్రైవేట్ ఆస్పత్రుల్లో నార్మల్ 601, సిజేరియన్ 4,316 డెలివరీలు అయ్యాయి. జనవరి నుంచి మే వరకు 4,378 ప్రసవాలు కాగా నార్మల్ డెలివరీలు 1,580, సిజేరియన్ 2,798 అయ్యాయి.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో..

నెల	నార్మల్	సిజేరియన్
జనవరి	312	372
ఫిబ్రవరి	241	489
మార్చి	264	357
ఏప్రిల్	303	358
మే	272	332

ప్రైవేట్ ఆస్పత్రుల్లో..

నెల	నార్మల్	సిజేరియన్
జనవరి	39	196
ఫిబ్రవరి	37	166
మార్చి	35	167
ఏప్రిల్	44	164
మే	33	197

'ప్రైవేట్'కాసుల కక్కుర్తి..

ప్రైవేట్ ఆస్పత్రుల్లో సీ సెక్షన్‌లు తగ్గించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ లేకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని వసతులున్నాయని అధికారులు చెబుతున్నా.. సేవల్లో జాప్యం, కొందరు వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రుల బాట పడుతున్నారు. ఇదే అదనుగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీ అయ్యే అవకాశం ఉన్నా సెక్షన్లు చేస్తూ రూ. వేలకు వేలు లాగేస్తున్నారు. పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రుల ఉద్యోగులు కమీషన్లకు ఆశపడి గర్భిణులను ప్రైవేట్ ఆస్పత్రులకు పంపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందుగానే ప్యాకేజీలు నిర్ణయించుకుని మరీ కోతలు కోస్తున్నారు.

పీహెచ్‌సీలలో అంతంత మాత్రమే..

జిల్లాలో ఆరు పీహెచ్‌సీల్లో డెలివరీలు జరగాలని సకల సౌకర్యాలు కల్పించారు. కానీ వాటిలో డెలివరీలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. జిల్లా వైద్యారోగ్యశాఖ దృష్టి సారించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పతుల్లో నార్మల్ డెలివరీలు ఎక్కువగా అయ్యేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

చర్యలు తప్పవు

నార్మల్ డెలివరీ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ సిజేరియన్ చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆడిట్ నిర్వహిస్తాం.. ఎక్కువగా సిజేరియన్లు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి.

– శ్రీనివాస్,
ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ

ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దండి

కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులతో పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు జిల్లాలోని 814 పాఠశాలల్లో చేపట్టగా.. ఇప్పటివరకు 465 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఇందుకుగాను రూ.16 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇంకా 349 పాఠశాలల్లో యుద్ధప్రాతిపాదికన పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల్లో ఏదైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. నేటికీ పనులు ప్రారంభం కాని పాఠశాలల్లో వెంటనే పనులు మొదలయ్యేలా చూసి నెలాఖరు వరకు పూర్తి చేయాలన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో సైతం ఈ పథకంలో కావాల్సిన పనులను చేపట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి రామస్వామి, ఇంజనీరింగ్ విభాగాలు ఆర్అండ్‌డబ్ల్యూ, పంచాయతీరాజ్ ఈడబ్ల్యూఐడిసి ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యాబోధన

కొండపాక(గజ్వేల్): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్యాబోధన జరగాలని కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. కొండపాక మండలం దుద్దెడలో గల స్వయంభు శంభు దేవాలయ ఆవరణలో అంగన్‌వాడీ టీచర్లకు పోషణ అభియాన్ సిబ్బంది సహకారంతో ప్రీస్కూల్ విధానంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యం నుంచి పిల్లలు విద్యపై ఆసక్తిని పెంచుకునేలా అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని కోరారు. చిన్న పిల్లల మనస్సుకు అర్థమయ్యే విధంగా ఆటలు, పాటలతో సంతోషపరుస్తూ చదువుపై ఆసక్తి పెరిగేలా చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1150 అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్ : డీఐఈఓ



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఐఈఓ, ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) సూర్యప్రకాశ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన సౌకర్యాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, వారి సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. విశాలమైన తరగతి గదులు, ప్రయోగశాలలు, ఆట స్థలం ఉన్నట్లు చెప్పారు. గత సంవత్సరం చాలా మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఐదు జనరల్ కోర్సులు, మరో ఐదు ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, పదో తరగతి పాసైన విద్యార్థులు వెంటనే ప్రవేశాలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్ షిప్‌ను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్ కనకచంద్రం, వి.అశోక్, నంట శ్రీనివాస్ రెడ్డి, పంజా గంగాధర్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

'సీజనల్'పై అవగాహన కల్పించండి

సిద్దిపేటరూరల్: వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని చింతమడక పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లో పరీక్షల తీరు, టెక్నీషియన్ రికార్డులను పరిశీలించారు, అనంతరం మాట్లాడుతూ జ్వరం, నీళ్ల విరేచనాలు, తదితర సమస్యలతో బాధపడేవారిని గుర్తించి వెంటనే చికిత్స అందించాలన్నారు. అవసరమైతే మెడికల్ క్యాంపులను నిర్వహించాలని సూచించారు. మండల స్థాయిలో రాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతిరోజూ డ్రై డే నిర్వహించాలన్నారు. ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రానికి వచ్చే మహిళలకు స్క్రీనింగ్ నిర్వహించి చికిత్స అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

భూ కబ్జాలను సహించం



మున్సిపల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనని, ఈ అంశం అభివృద్ధికి అవరోధంగా మారకూడదని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. శుక్రవారం తెల్లాపూర్‌లో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని, గద్దర్ ఆడిటోరియం పనులకు శంకుస్థాపన, భారీ జాతీయ జెండా స్తంభాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెల్లాపూర్ మహానగరంగా అవతరిస్తుందని తెలిపారు. ఎవరైనా కబ్జాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పాలకవర్గ విజ్ఞప్తి మేరకు 15రోజుల్లో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించుకుందామని తెలిపారు.

అమ్మవారికి కానుక

వెండి ఆభరణం సమర్పించిన కేంద్రమంత్రి బండి సంజయ్



హుస్నాబాద్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్ తొలిసారి హుస్నాబాద్ రావడంతో బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రికి డప్పుచప్పుళ్లు, మేళాతాళాలతో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని నాలుగున్నర కిలోల వెండి తొడుగును కానుకగా సమర్పించారు. ఆలయ ఏఓ మంత్రిని ఘనంగా సన్మానించారు. బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఆర్ఐ దుర్గయ్య



ఆర్ఐ దుర్గయ్య

న్యాల్‌కల్(జహీరాబాద్): రైతు వద్ద నుంచి లంచం తీసుకుంటున్న ఓ అధికారి ఏసీబీ వలలో పడ్డాడు. ఈ ఘటన న్యాల్‌కల్ మండల పరిధిలోని గంగ్వార్ చౌరస్తా వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. మెదక్ ఏసీబీ రేంజ్ డీఎస్పీ సుదర్శన్ కథనం మేరకు.. మండల పరిధిలోని గణేశ్‌పూర్‌కు చెందిన హెచ్. మల్లప్పకు చెందిన 2 ఎకరాల 36 గుంటల అసైన్డ్ భూమి నిమ్జ్ భూసేకరణలో ప్రభుత్వం తీసుకుంది. పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విషయమై తాను రిపోర్టు పంపిస్తేనే డబ్బులు వస్తాయని ఆర్ఐ దుర్గయ్య రైతు మల్లప్పకు చెప్పాడు. రూ.లక్ష ఇస్తేనే పని చేస్తానని ఆర్ఐ డిమాండ్ చేశాడు. చేసేది లేక రూ.లక్ష చెల్లించేందుకు అంగీకరించాడు. అందులో భాగంగా ఈనెల 14న ముందుగా రూ.30 వేలు ఆర్ఐకి చెల్లించాడు. అంతలోనే పరిహారం సొమ్ము రైతు మల్లప్ప ఖాతాలో జమైంది. తాను ప్రభుత్వానికి రిపోర్టు పంపడం వల్లే డబ్బులు వచ్చాయని, మిగిలిన రూ.70 వేలు ఇవ్వాలని రైతును వేధించడం మొదలు పెట్టాడు. విసిగెత్తిపోయిన రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం రూ.70 చెల్లిస్తానని గంగ్వార్ వద్దకు రావాలని రైతు ఆర్ఐకి చెప్పాడు. అక్కడికి వచ్చిన దుర్గయ్య రైతు వద్ద నుంచి రూ.70 వేలు లంచం తీసుకుంటుడగా సమీపంలో కాపు కాస్తున్న ఏసీబీ అధికారులు డీఎస్పీ సుదర్శన్, ఎస్ఐలు వేణు కుమార్, రమేశ్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఈ వేధింపులు భరించలేం!

ఆర్టీసీ డ్రైవర్ల ఆందోళన

మెదక్‌జోన్: అధికారుల వేధింపులకు నిరసనగా ఆర్టీసీ డ్రైవర్లు శుక్రవారం ఆందోళనకు దిగారు. దీంతో బస్సులు డిపోకే పరిమితం కాగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ ఆర్ఎం దైవాదీనం వారితో రెండు గంటల పాటు చర్చలు జరిపినా ఫలించలేదు. మెదక్ డిపోలో 103 బస్సులు ఉండగా వాటిలో 70 పల్లె వెలుగు బస్సులు ప్రైవేట్‌కు సంబంధించివి ఉన్నాయి. మిగితా 33 ఆర్టీసీ సంస్థకు చెందినవి. ఇందులో డీలక్స్, ఎక్స్‌ప్రెస్, లగ్జరీ బస్సులు ఉన్నాయి. వీటిని మాత్రమే సంస్థకు చెందిన 60 మంది డ్రైవర్లు దూరప్రాంతాలకు తిప్పుతున్నారు. అయితే కొంతకాలంగా డీఎం, సీఐ వేధింపులు అధికమయ్యాయని డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. గతంలో ఒక్కో బస్సును రెండు రోజుల్లో 540 కిలో మీటర్లు నడిపేవారమని, ప్రస్తుతం రెండు రోజుల్లో 720 కిలోమీటర్ల మేర తిప్పుతున్నామన్నారు. వారంలో 6 రోజుల పాటు నిరంతరంగా డ్యూటీ చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిమ్స్ డ్యూటీల పేరిట ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. మిగితా డిపోల మాదిరిగా రెండు రోజులు 720 కిలోమీటర్లు బస్సును నడిపిన డ్రైవర్‌కు 3వ రోజు స్పెషల్ ఆఫ్ ఇవ్వాలని కోరుతున్నారు. ఓటీలు చేయడం వల్ల ఆరో గ్యం దెబ్బతింటుందని చెబుతున్నారు. కనీసం బంధువులు చనిపోయిన సెలవు ఇవ్వడం లేదన్నారు. ఈసందర్భంగా 14 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఎం, డిప్యూటీ ఆర్ఎంకు అందించారు.



మెదక్ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న డ్రైవర్లు

చర్చలు విఫలం

విషయం తెలిసిన వెంటనే డిప్యూటీ ఆర్ఎం దైవాదీనం హుటాహుటిన మెదక్ వచ్చి డ్రైవర్లతో రెండు గంటల పాటు చర్చలు జరిపారు. గతంలో మాదిరిగా తాము బస్సులు నడుపుతామని, డీఎం, సీఐ వేధింపులు మానుకోవాలని కోరారు. ఈ విషయపై డీఎం సు ధా, ఆర్ఎం మట్లాడుతూ.. ఆర్టీసీ ఎండీ ఆదేశాల మేరకు నూతనంగా వచ్చిన షెడ్యూల్ ప్రకారమే విధులు నిర్వర్తించాలని చెప్పగా డ్రైవర్లు చర్చల నుంచి వెళ్లిపోయారు. ఫలితంగా బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

క్లుప్తంగా

గంజాయి, డ్రగ్స్ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం బూర్గుపల్లి గ్రామంలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల బ్లాక్ స్పాట్స్ గుర్తించడం కోసం సిద్దిపేట రూరల్ పోలీసులు నార్కోటిక్స్ డాగ్‌తో శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై అపూర్వరెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బూర్గుపల్లి గ్రామంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరికొన్ని బ్లాక్ స్పాట్స్‌లలో త్వరలో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు సమూలంగా నిర్మూలించే విధంగా ప్రణాళికలు తయారు చేసినట్టు తెలిపారు. విక్రయించే వారితోపాటు కొనే వారిపై ప్రత్యేకంగా నిఘా పెట్టినట్టు పేర్కొన్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాజస్థాన్‌కు చెందిన మదన్ వైష్ణవ్ భార్యాపిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ పరిధిలోని ఓడీఎఫ్ కాలనీలోకి వచ్చారు. కార్పెంటర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 20వ తేదీన మదన్ వైష్ణవ్ భార్య మమత, ఇద్దరు కూతుర్లు నవ్య(4), మాన్య(2)ను తీసుకొని ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. వైష్ణవ్ భార్యాపిల్లల కోసం చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం మదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాపన్నపేట(మెదక్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మిన్‌పూర్ శివారులో శుక్రవారం వెలుగు చూసింది. పాపన్నపేట ఏఎస్ఐ సంగన్న కథనం మేరకు.. టేక్మాల్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి మల్లయ్య (67) తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈ నెల 19న బయటకు వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. మరుసటి రోజు ఉదయం మిన్‌పూర్ శివారులో కల్వర్టు కింద తీవ్ర గాయాలతో పడి ఉండగా స్థానికులు గుర్తించి మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టేక్మాల్ మండలం సంగ్యా తండాకు చెందిన ఓ వ్యక్తితో వెంకటాపూర్‌కు డంపింగ్ యార్డు వద్ద మద్యం సేవించినట్లు తెలిసింది. అనంతరం ఇద్దరు కలిసి పాపన్నపేటకు వచ్చి తిరిగి మద్యం సేవించినట్లు సమాచారం. మృతుడి భార్య వీరమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

కల్హేర్(నారాయణఖేడ్): అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కృష్ణాపూర్‌లో చోటు చేసుకుంది. కల్హేర్ ఎస్ఐ వెంకటేశం కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం అజంబాద్‌కు చెందిన సుమలత (24)కు నాలుగేళ్ల కిందట కృష్ణాపూర్‌కు చెందిన ఎరుకల ప్రవీణ్‌తో వివాహం జరిగింది. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో సుమలత పుట్టింటికి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు నచ్చజెప్పడంతో నాలుగు రోజుల కిందట తిరిగొచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుమలత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అత్తింటి వేధింపులు తాళలేక కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి నాగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి భర్త ప్రవీణ్‌తో సహా నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

నకిలీ విత్తు నమ్మితే చిత్తు

- వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధం
- మార్కెట్‌లో నాసిరకం విత్తనాలు
- కొనేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
- బస్తాలపై పేరు, గడువు తేదీ సరి చూసుకోవాలి
- విక్రయాలపై అధికారుల నిఘా



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

తొలకరి చినుకులు పలుకరించాయి. రైతన్నలు వానాకాలం సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఆరుగాలం శ్రమకు తగిన ఫలితం దక్కాలంటే ఆది నుంచి రైతులు వేసే పంట విషయంలో అప్రమత్తంగా ఉండటం తప్పనిసరి. దుక్కి దున్నింది మొదలుకొని పంట చేతికొచ్చే వరకు ప్రతీ చోట జాగ్రత్తలు పాటిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మహేశ్ అంటున్నారు. కొందరు డీలర్లు నకిలీ విత్తనాలను విక్రయిస్తూ ప్రతీ ఏటా అన్నదాతలను నట్టేట ముంచుతున్నారు. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో అత్యంత జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు.

– దుబ్బాకటౌన్

జిల్లాలో నకిలీ విత్తన విక్రయాలపై అధికారులు నిఘా పెంచారు. ప్రతీ గ్రామంలో విత్తన కొనుగోలు కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం సైతం నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న వారిపై పీడీ యాక్ట్ చేయాలని ఆదేశించింది. అయినా రైతుల అమాయకత్వాన్ని కొంత మంది సొమ్ము చేసుకోవాలని చూస్తుంటారు. ఈ నేపథ్యంలో రైతులు విత్తనాలు, ఎరువుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

విత్తనాల కొనుగోలు ఇలా..

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బస్తాల పై పేరు, గడువు తేదీ వివరాలు తప్పకుండా గమనించాలి.
- సరిగా సీల్ చేసి ఉన్న బస్తాలు, ధ్రువీకరణ పత్రం ఉన్న విత్తనాలను మాత్రమే కొనాలి.

రశీదు తప్పనిసరి..

- రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రశీదు తప్పకుండా తీసుకోవాలి.
- రశీదుపై విత్తన రకం, గడువు తేదీ పేర్కొనేలా డీలర్ సంతకం తీసుకోవాలి. రైతు సంతకం కూడా ఉండేలా చూసుకుంటే మేలు.
- విత్తనాలను కొనుగోలు చేసే ముందు వ్యవసాయ శాఖ అధికారి, శాస్త్ర వేత్తల సూచనలు తీసుకోవాలి.
- మార్కెట్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా ధ్రువీకరించిన విత్తనాలు విక్రయిస్తాయి. వీటిని కొనుగోలు చేసే సమయంలో బస్తా పై నీలి వర్ణం ట్యాగ్ ఉందో లేదో గమనించాలి.
- లేబుల్ విత్తనాలు కూడా మార్కెట్లో లభ్యమవుతున్నాయి. జిల్లాలో ఈ రకం విత్తనాలు అధికంగా కొనుగోలు చేస్తున్నారు.
- వీటి కొనుగోలు చేసే ముందు విత్తన సంచి పై ఆకు పచ్చ ట్యాగ్ కట్టి ఉంటుంది. దీని పై విత్తన ప్రమాణాలు ముద్రించి విక్రయిస్తారు. ఈ విత్తనాలను రైతులు కేవలం ఆయా కంపెనీ నమ్మకం పై మాత్రమే కొనుగోలు చేయాలి. పూర్తి వివరాలు తీసుకొని డీలర్ల నుంచి సరైన బిల్లు తీసుకోవాలి.

ఎరువులపై జాగ్రత్తలు..

- పంటల అధిక దిగుబడికి ఎరువులు ఎంతో మేలు చేస్తాయి. కానీ కొందరు దళారుల, వ్యాపారులు నాసిరకం ఎరువులు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నారు.
- ఫలితంగా అమాయక రైతులు నష్టపోతున్నారు. ఈ మేరకు కొన్ని మెలకువలు పాటిస్తే నకిలీలను నివారించే అవకాశం ఉంది.
- లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే ఎరువులను కొనుగోలు చేయాలి.
- డీలర్ బుక్‌లో రైతులు తప్పకుండా సంతకం చేయాలి.

గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారి లైసెన్స్ రద్దు చేస్తాం. ఎక్కడైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే రైతులు వెంటనే దగ్గరలో వ్యవసాయాధికారికి సమాచారం అందించాలి. చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. రైతులకు విత్తన ఎంపికలో, నకిలీ విత్తనాల విషయంలో ఏఈఓల ద్వారా గ్రామ పంచాయతీల్లో అవగాహన కల్పిస్తున్నాం.

–మహేశ్, జిల్లా వ్యవసాయాధికారి

బడులు ప్రారంభం.. బస్సుల ఆటంకం

- మొదలుకాని ఆర్‌టీసీ బడి బస్సులు
- చేగుంట, పేట మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థుల అవస్థలు
- జాతీయ రహదారిపై గంటల తరబడి నిరీక్షణ



బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): చేగుంట మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌కు వెళ్లేందుకు ఆర్‌టీసీ బడి బస్సు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో జాతీయ రహదారి పైనే నార్సింగి మండల కేంద్రంతోపాటు వల్లూర్, వల్లభాపూర్ గ్రామాల విద్యార్థులు గంటల తరబడి వేరే బస్సులు, ఆటోల కోసం ఎదురుచూస్తున్నారు. అలాగే చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థుల సౌకర్యం కోసం గతంలో నడిచిన ఆర్‌టీసీ బడి బస్సు కూడా ఇంకా ప్రారంభం కాలేదు. మండలంలోని ఖాజాపూర్, శాలిపేట, మడూర్, గవ్వలపల్లి గ్రామాల విద్యార్థులను తీసుకొచ్చి మోడల్ స్కూల్‌లో చేరవేసి, అదే బస్సు చందంపేట, రుద్రారం, ధరిపల్లి, సూరారం గ్రామాల విద్యార్థులను తీసుకొచ్చేది. ఉదయం విద్యార్థులను పాఠశాల వద్ద దింపడంతో పాటు సాయంత్రం తిరిగి గ్రామాలకు చేరవేసేది. ఈ విద్యాసంవత్సరం మొదలైనా ఇంకా బస్సులు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థుల కోసం బస్ సౌకర్యం కల్పించాలని తల్లి తండ్రులు కోరుతున్నారు.

దాడులు ఖండించాలి



వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలో ఓ పత్రికలో పని చేస్తున్న జర్నలిస్టుపై మట్టి అక్రమార్కులు దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎలాంటి అనుమతులు లేకుండా కొండపాకలో చెరువుల్లోంచి, ఇతరత్ర భూముల్లోంచి మట్టిని అక్రమంగా టిప్పర్లలో వెంచర్లకు తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న జర్నలిస్టులు బైక్‌లపై ఆ స్థలాలను పరిశీలించి వస్తుండగా మట్టి తరలించే అక్రమార్కులు నర్సింహ్మారెడ్డి జర్నలిస్టు వాహనాన్ని ఢీకొట్టారు. కిందపడి పోగా అతడిని విచక్షణా రహితంగా కొట్టారు. వెంటనే తోటి జర్నలిస్టులు నర్సింహ్మారెడ్డిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడిని సిద్దిపేట జిల్లా వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగాచారి, అరుణ్‌కుమార్‌తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజిరెడ్డి పరామర్శించారు. అనంతరం జర్నలిస్టులపై వరుసగా మట్టి అక్రమార్కుల తీరులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం సీపీ అనురాధను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ సభ్యులు సంజీవరెడ్డి, రంగదాంపల్లి శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు.

కూలి కోసం వస్తే ప్రాణం పోయింది

సిమెంట్ దిమ్మె పడి వ్యక్తి మృతి

మెదక్ మున్సిపాలిటీ: పొట్ట కూటికోసం కూలీ పనులకు వచ్చిన గిరిజనుడు సిమెంట్ దిమ్మె మీద పడటంతో మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మెదక్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మెదక్ మండలం బొల్లారం తండాకు చెందిన పానుగోత్ ఫకీరా (36) మెదక్ పట్టణంలోని లేబర్ అడ్డాపై కూలీగా పని చేస్తుంటాడు. రోజుమాదిరిగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పిచ్చి మొక్కలు తొలగించేందుకు కూలి పనికి వెళ్లాడు. పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు పెద్ద సిమెంట్ దిమ్మ మీద పడటంతో ఫకీరా అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి తల్లి చాందీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంపులోకి దిగి ప్లంబర్..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సంపులోకి దిగి ప్లంబర్ మృతి చెందిన ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆకృతి అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. కొల్లూర్ పోలీసుల కథనం మేరకు.. ఒరిస్సా రాష్ట్రంలోని శ్రీచంద్రపురానికి చెందిన కాశీపత్రు (34) జీవనోపాధి కోసం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌కు వలస వచ్చాడు. అక్కడే ఉంటూ ఆకృతి అపార్ట్‌మెంట్ మెయింటెనెన్స్‌లో ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అపార్ట్‌మెంట్‌లోని సంపులో నీళ్లు నిలవడంతో కాశీపత్రు దిగి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడి స్నేహితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

చిన్నశంకరంపేట(మెదక్): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట మండలం ఎస్.కొండాపూర్ శివారులోని ఏడిప్పల్ వద్ద మెదక్ రోడ్డుపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొర్విపల్లి వైపు నుంచి నడుచుకుంటూ మెదక్ వైపు వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సుమారు 55 ఏళ్ల వయస్సు ఉండడంతోపాటు రెండు రకాల బీడీ చుట్టలు, అగ్గిపెట్టె లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్నామన్నారు.

పిల్లల 'బడిబాట'

- ఫలించిన కలెక్టర్ రాహుల్‌రాజ్ కృషి
- ప్రజలను ఆకట్టుకున్న పల్లెనిద్ర
- కొత్తగా 7,643 మంది విద్యార్థులు పాఠశాలలో చేరికలు
- ఈనెల 6 నుంచి 19 వరకు విజయవంతమైన కార్యక్రమాలు



చిన్నారులకు అక్షరాలు దిద్దిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్: బడీడు పిల్లలెవరూ బడిబయట ఉండకూడదని కలెక్టర్ రాజ్ ప్రత్యేక చొరవ చూపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6 నుంచి 19 వ తేదీ వరకు 13 రోజులపాటు బడి బాట కార్యక్రమంపై ఆయనే ప్రత్యేకంగా షెడ్యూల్ తయారు చేశారు. ఈ మేరకు పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. తమ గ్రామంలో బడీడు పిల్లలు బడి బయట లేరనే సర్టిఫికెట్‌ను ప్రతీ కార్యదర్శి తనకు ఇవ్వాలని ఆదేశించారు. అంతే కాకుండా జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేకంగా పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేయించారు. కలెక్టర్ సైతం మారుమూల గ్రామమైనా నర్సాపూర్ మండలం జక్కెపల్లిలో పల్లె నిద్ర చేశారు.

300 ఇళ్లు స్వయంగా తిరిగి..

మరుసటి రోజున ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో 300 ఇళ్ల స్వయంగా తిరిగి బడిబయట పిల్లల గురించి ఆరాతీశారు. కొంతమంది పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి స్కూల్ బాట పట్టించారు. బడిబాటలో భాగంగా మెదక్ మండలం మక్తభూపతిపూర్ గ్రామంలో అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ స్వయంగా హాజరై చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. బడిబాట కోసం ఏర్పాటు చేసిన అనేక ర్యాలీల్లో ఆయన పాల్గొన్నారు. పెద్దశంకరంపేట మండలంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి బడిబాటకు హాజరయ్యారు. విద్యార్థులకు, యూనిఫామ్‌లు, బుక్స్ స్వయంగా అందించారు. చివరగా మంత్రి కొండా సురేఖ, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిలతో కలిసి కొల్చారంలో బడిబాట కార్యక్రమాన్ని ముగించారు.

జిల్లాలో 7,643 మంది చేరిక

బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 13రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించారు. ఇది విజయంతం కావడంతో మొత్తం 7,643 మందిని గుర్తించి వివిధ పాఠశాలల్లో చేర్పించారు. అందులో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 3,139 మంది చిన్నారులు 1వ తరగతిలో చేరగా, 4,504 మంది బడీడు పిల్లలను గుర్తించి పలు తరగతుల్లో చేర్పించారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో 76,358 మంది విద్యార్థులు ఉండగా కొత్తగా చేరిన వారితో ఈ సంఖ్య 84 వేలకు చేరుకుంది.

భూమి రిజిస్ట్రేషన్ చేయకపోతే చంపుతాం

- పోలీసులమని చెప్పి బెదిరింపు
- ప్రధాన నిందితుడు రిమాండ్

పటాన్‌చెరు టౌన్: నీ పేరు మీద ఉన్న భూమి రిజిస్ట్రేషన్ చేయకపోతే చంపుతామని బెదిరించిన ఘటనలో ప్రధాన నిందితుడిని పటాన్‌చెరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్న తాతయ్య, రాంరెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండేవారు. శివంపేట మండలం అక్సాన్పల్లికి చెందిన రమేశ్ శివంపేటలోని 3 ఎకరాల 24 గుంటల వ్యవసాయ భూమిని తాతయ్య మీద నమ్మకంతో అతడిపై రిజిస్ట్రేషన్ చేయించాడు. అయితే, మూడు నెలల కిందట మనం వేరే వాళ్లకి ఆ స్థలం విక్రయించి డబ్బులు తీసుకుందామని తాతయ్యను రాంరెడ్డి ఒత్తిడి చేయగా అతడు ఒప్పుకోలేదు. అయినా వినకుండా రాంరెడ్డి వేరే వాళ్లతో మాట్లాడుకొని తాతయ్య బ్యాంకు ఖాతాలో రూ.9.75 లక్షలు ఏప్రిల్ 6వ తేదీన జమ చేయించాడు. అదే నెల 18వ తేదీ చౌటకూరు రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కి వచ్చి సంతకం చేయాలని తాతయ్యను బెదిరించాడు. ఆ భూమి రమేశ్‌దని అతడిని అడిగి చెబుతానన్నాడు. ఈనెల 19వ తేదీ ఇస్నాపూర్ లో గ్రామ చౌరస్తాలో పండ్లు కొనుగోలు చేస్తుండగా కారులో నలుగురు వ్యక్తులు వచ్చి నిన్ను ఎస్ఐ రమ్మంటున్నాడని, రాంరెడ్డితో కలిసి తాతయ్యని బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు. నీ పేరు మీద ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయకపోతే చంపేస్తామని బెదిరించారు. తాతయ్య కారులో నుంచి బయట పడి పరారయ్యాడు. ఈనెల 20వ తేదీన పటాన్ చెరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి వికారాబాద్ జిల్లా కోతులాపూర్‌కు చెందిన ఇస్నాపూర్ శాలివాహన కాలనీలో ఉంటున్న రాంరెడ్డిని అదుపులోకి తీసుకొని అతన్ని రిమాండ్‌కు తరలించారు. మిగిలిన నిందితులు మహారాజ్, సెక్బార్, సయ్యిద్ అజీమ్ పరారీలో ఉన్నారని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి



రైతు వేదికలో మాట్లాడుతున్న జడ్జి రమేశ్

సీనియర్ సివిల్ జడ్జి రమేశ్

మునిపల్లి(అందోల్): రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వివిధ రకాల పథకాలను వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవల అథారిటీ, సీనియర్ సివిల్ జడ్జి బి.రమేశ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన మునిపల్లి రైతు వేదికలో ఆయా గ్రామాల రైతులతో మాట్లాడారు. విత్తన లోపం వల్ల పంట నష్టపోయిన రైతులు న్యాయ స్థానంను ఎలా ఆశ్రయించాలో వివరించారు. అలాగే ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు ఎలా సద్వినియోగం చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పత్తి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఏఓ అబికాసోని, ఏడీఏ శ్రీనివాస్ ప్రసాద్, సత్యనారాయణ, తహసీల్దార్ తెన్‌మొళి, ఏఎస్ఐ భిక్షపతి , మండల వ్యవసాయాధికారి శివకుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యలో మార్పులు

- రెండేళ్లు చదివితే ఇంటర్ సర్టిఫికేట్
- డిప్లొమా పూర్తి చేస్తే నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలోకి..
- విద్యార్థులకు ఆసక్తి పెంచేందుకు ఏఐసీటీఈ మార్పులు
- జిల్లాలో 5 పాలిటెక్నిక్ కళాశాలలు, 6 బ్రాంచీలు, 720 సీట్లు



హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

హుస్నాబాద్‌రూరల్: పాలిటెక్నిక్ అంటే ఇంగ్లిష్ మీడియం అని భయపడే విద్యార్థులకు ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) కొత్త నిబంధనలు తెచ్చింది. పాలిటెక్నిక్ చేయాలంటే మూడేళ్లు చదవాల్సి ఉండటంతో విద్యార్థులు మొగ్గు చూపడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు పాలిటెక్నిక్‌పై ఆసక్తి కలిగించడానికి కొత్త మార్పులు తీసుకొచ్చింది.

విద్యార్థులు రెండేళ్లు చదివిన తర్వాత డిప్లొమా చేయడం ఇష్టం లేకపోతే వారికి ఇంటర్మీడియట్ సర్టిఫికేట్ ఇస్తారు. దీంతో ఆ విద్యార్థులు డిగ్రీ ఎంపీసీ గ్రూపులో ప్రవేశం పొంది చదువు కొనసాగించొచ్చు. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందుతారు. బీటెక్ చదవడం కష్టం అనిపిస్తే తృతీయ సంవత్సరం పూర్తి చేసిన వారికి సాధారణ డిగ్రీ పట్టా అందిస్తారు. గతంలో ఒక సారి ప్రవేశం పొందితే పూర్తి చేసే వరకు విద్యార్థులకు మరో కోర్సు చదవడానికి వీలు లేకుండేది. ఏఐసీటీఈ తెచ్చిన ఈ మార్పులు గ్రామీణ విద్యార్థులకు వరంగా మారిందని చెప్పొచ్చు. 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాలిటెక్నిక్‌లో ప్రవేశం పొందడానికి ఎంట్రెన్స్ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఎస్సెసీ (స్టాఫ్ సెలక్షన్ కమిషన్) నిర్వహించే జేఈ (జూనియర్ ఇంజనీరు) ఉద్యోగాలకు పోటీ పడి ఉద్యోగాలు సాధించొచ్చు.

జిల్లాలో ఐదు పాలిటెక్నిక్‌లు, 720 సీట్లు..

సిద్దిపేట జిల్లాలో ఐదు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు ఉండగా అందులో 6 బ్రాంచీల్లో 720 సీట్లు ఉన్నాయి. హుస్నాబాద్‌లో సివిల్, ఈఈఈ బ్రాంచీల్లో 120 సీట్లు, చేర్యాల సివిల్, ఈఈఈలో 120 సీట్లు, గజ్వేల్ ఈఈఈ, సీసీపీ, మెకానికల్‌లో 180 సీట్లు, సిద్దిపేట (బాలికల) ఈఈఈ, సివిల్, సీఎస్సీలో 180 సీట్లు, సిద్దిపేట-2 (రాజగోపాల్‌పేట) లో ఈఈఈ, సీఎస్‌సీలో 120 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు గ్రామీణ ప్రాంతంలో ఉండటంతో పల్లెటూరి విద్యార్థులు ఇంటి దగ్గర నుంచే కళాశాలకు రావొచ్చు.

గ్రామీణ విద్యార్థులకు సదావకాశం



సాంకేతిక విద్యను అభ్యసించడం వల్ల వేగంగా ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుంది. గ్రామీణ విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. డిప్లొమా పూర్తి చేసిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. పాలిసెట్ రాసిన విద్యార్థులు కౌన్సింగ్ కోసం ఈ నెల 24 వరకు స్లాట్ బుక్ చేసుకోవాలి. భవన నిర్మాణ రంగంలో సివిల్ ఇంజనీర్లకు, విద్యుత్ శాఖలో ఈఈఈ విద్యార్థులకు అవకాశాలు మెండుగా ఉంటాయి.

–డాక్టర్, కె.అశోక్, ప్రిన్సిపాల్ పాలిటెక్నిక్ కళాశాల హుస్నాబాద్



సాయంకాల సంధ్యవేళ..

సాయంకాలం అంటేనే ఆహ్లాదకర వాతావరణానికి చిరునామా.. సంధ్యవేళలో మబ్బులచాటున్న భానుడు దోబూచులాడుతుండగా ఆకాశంలో వివిధ వర్ణాలు కనిపించాయి. మబ్బులు కమ్మేస్తున్నట్లు రమణీయ దృశ్యం కోమటి చెరువు ట్యాంక్ బండ్ పై సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

–స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట